
ఆంధ్రజ్యోతి



జయశంకర్ భూపాలపల్లి 3 ములుగు

శుక్రవారం 15 మార్చి 2024



రంజాన్ వేళలు

ఇఫ్తార్ : శుక్రవారం సా : 6.31 గం..

సహర్ : శనివారం ఉ : 5.02 గం..

తీన్‌మార్

మానుకోట పార్లమెంట్ బరిలో పాత ముఖాలే..

- ముగ్గురూ ముగ్గురే.. గెలుపుపై ఎవరి ధీమా వారిదే..
- త్రిముఖ పోటీతో రసవత్తరంగా రాజకీయం



మహబూబాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే సమయం సమీపిస్తోంది. ఇప్పటికే మహబూబాబాద్ ఎంపీ స్థానం నుంచి బరిలో నిలిచే అభ్యర్థులెవరో తేలిపోయింది. ప్రధాన పార్టీలు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ తమ అభ్యర్థులను ప్రకటించాయి. తొలుత గులాబీ బాస్ కేసీఆర్ సిట్టింగ్ ఎంపీ మాలోతు కవితకే టికెట్ కేటాయించగా.. ఆ తర్వాత 'హస్తం' పార్టీ తమ అభ్యర్థిగా కేంద్ర మాజీమంత్రి, పోరిక బలరాంనాయక్ పేరును ప్రకటించింది. తాజాగా బుధవారం రాత్రి బీజేపీ అధిష్ఠానం మాజీ ఎంపీ, ప్రొఫెసర్ అజ్మీరా సీతారాంనాయక్‌ను మానుకోట బరిలో నిలుపుతున్నట్లు వెల్లడించింది. అయితే ఈ ముగ్గురు మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు పాతముఖాలే కాగా.. గెలుపు తమదేనంటూ ఎవరికి వారు ధీమాగా ఉన్నారు. దేశవ్యాప్తంగా పార్లమెంటరీ నియోజకవర్గాల పునర్విభజన సమయంలో 2009లో మహబూబాబాద్ ఎస్టీ రిజర్వుడ్‌గా ఆవిర్భవించింది. ములుగు, నర్సంపేట, మహబూబాబాద్, డోర్నకల్, ఇల్లెందు, పినపాక, భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గాల ఏజెన్సీ బెల్టుతో మహబూబాబాద్ ఎంపీ నియోజకవర్గం రూపుదిద్దుకుంది. ఇందులో ఎంపీ సెగ్మెంట్‌తో పాటు ఏడు అసెంబ్లీ సెగ్మెంట్‌లలో నర్సంపేట మినహా మిగిలిన ఆరు ఎస్టీకే రిజర్వుడ్ అయ్యాయి. తొలి పార్లమెంటరీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నుంచి పోరిక బలరాంనాయక్, మహాకూటమి సీపీఐ నుంచి కుంజా శ్రీనివాసరావు, చిరంజీవి ప్రజారాజ్యం పార్టీ నుంచి రిటైర్డ్ ఐపీఎస్ అధికారి డీటీ నాయక్ త్రిముఖంగా పోటీపడ్డారు. త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో నాలుగోసారి మహబూబాబాద్‌కు తొలి ఎన్నికల తరహా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల మధ్య ప్రధాన త్రిముఖ పోటీ అనివార్యమని పరిశీలకులు భావిస్తున్నారు.

గత ఎన్నికల్లో ఫలితాలిలా..

2009లో తొలి ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి గెలిచిన పోరిక బలరాంనాయక్‌కు 3,94,447 ఓట్లు రాగా, ఆయన సమీప ప్రత్యర్థి సీపీఐ కుంజా శ్రీనివాసరావుకు 3,25,490 ఓట్లు లభించాయి. త్రిముఖ పోటీలో ఓటమి పాలైన పీఆర్పీ అభ్యర్థి డీటీ నాయక్‌కు 1,45,299 ఓట్లు లభించాయి. విజేత బలరాంకు 68,957 ఓట్ల మెజారిటీ లభించింది. ఆ తర్వాత 2014లో జరిగిన ఎన్నికల్లోనూ ఇదే రీతిన బీఆర్ఎస్, కాంగ్రెస్, టీడీపీల మధ్య త్రిముఖ పోరు నడిచింది. బీఆర్ఎస్ నుంచి గెలిచిన ప్రొఫెసర్ అజ్మీరా సీతారాంనాయక్‌కు 3,20,569 ఓట్లు రాగా, ఆయన సమీప కాంగ్రెస్ ప్రత్యర్థి పోరిక బలరాంనాయక్‌కు 2,85,577 ఓట్లు లభించాయి. ఈ త్రిముఖ పోటీలో ఓడిన టీడీపీ అభ్యర్థి బానోత్ మోహన్‌లాల్‌కు 2,15,904 ఓట్లు లభించాయి. విజేత అజ్మీర సీతారాంనాయక్ 34,992 ఓట్ల మెజారిటీ లభించింది. 2019 ఎన్నికల్లోనూ బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీల మధ్య త్రిముఖ పోటీ ఉంటుందని అంచనా వేశారు. కానీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ హోరాహోరీగా తలపడ్డాయి. బీఆర్ఎస్ నుంచి గెలిచిన మాలోతు కవితకు 4,62,109 ఓట్లు రాగా, సమీప కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్‌కు 3,15,446 ఓట్లు లభించాయి. బీజేపీ అభ్యర్థి జాటోతు హుస్సేన్‌నాయక్‌కు కేవలం 25,487 ఓట్లు వచ్చాయి. విజేత మాలోతు కవితకు 1,46,663 ఓట్ల మెజారిటీ లభించింది.

అనూహ్యంగా హేమాహేమీలు

రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మూడు ప్రధాన రాజకీయ పార్టీలు అనూహ్యంగా హేమాహేమీలను బరిలో నిలుపుతున్నాయి. మహబూబాబాద్ ఎస్టీ రిజర్వుడ్ పార్లమెంట్ ఆవిర్భావ ఎన్నికల్లో కాంగ్రెస్ తరుపున విజేతగా నిలిచి కేంద్ర క్యాబినెట్‌లో ప్రాతినిధ్యం పొందిన పోరిక బలరాంనాయక్‌ను కాంగ్రెస్ ఆచితూచి ఎంపిక చేసి పార్టీ టికెట్ కేటాయించింది. బీఆర్ఎస్ గత అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం పాలైనప్పటికీ మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా తిరిగి సిట్టింగ్ ఎంపీ మాలోతు కవితనే బరిలో నిలుపుతోంది. ఈ టికెట్ ఆశించి భంగపడ్డ బీఆర్ఎస్ మాజీ ఎంపీ, ప్రొఫెసర్ అజ్మీరా సీతారాంనాయక్ చివరి నిమిషంలో బీజేపీలో చేరి మహబూబాబాద్ టికెట్ సంపాదించుకుని తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఈ ముగ్గురిలో కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్, బీజేపీ అభ్యర్థి ప్రొఫెసర్ అజ్మీరా సీతారాంనాయక్ ఇద్దరు ములుగు అసెంబ్లీ సెగ్మెంట్‌కు చెందినవారే. బీఆర్ఎస్ అభ్యర్థి మాలోతు కవిత మహబూబాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్‌కు చెందిన వారు. ఈ ముగ్గురు ఎవరికి వారే తాము ఇదే లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించి ఉండటంతో అన్ని అసెంబ్లీ సెగ్మెంట్‌లలో నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రజలతోనూ సత్సంబంధాలు కలిగి ఉండి, విజయాన్ని చేరుకోవాలని సర్వశక్తులు ఒడ్డనున్నారు.

ఓసీ భూనిర్వాసితుల కన్నెర్ర

సింగరేణి జీఎం కార్యాలయం వద్ద నిరసన



భూనిర్వాసితులతో మాట్లాడుతున్న సింగరేణి జీఎం శ్రీనివాసరావు

కాకతీయఖని, మార్చి 14: సింగరేణి భూపాలపల్లి ఏరియా ఓసీ-2 భూ నిర్వాసితులు ఆ సంస్థ జీఎం కార్యాలయం వద్ద గురువారం ఆందోళనకు దిగారు. తమ భూములను సేకరించిన సింగరేణి అధికారులు పరిహారం చెల్లించలేదని, ఇప్పటికైనా న్యాయం చేయకుంటే పనులను అడ్డుకుంటామని ఆకుదారివాడ, ఫక్కీర్‌గడ్డకు చెందిన భూనిర్వాసితులు హెచ్చరించారు. 2015లో తమ భూములను తీసుకుని అక్కడ ప్రాజెక్ట్ ఏర్పాటు చేశారని, పరిహారం మాత్రం ఇప్పటి వరకు చెల్లించలేదన్నారు. 2019లో వంటావార్పు కార్యక్రమం ద్వారా నిరసన తెలపగా యాజమాన్యంతో మాట్లాడి రూ.22 కోట్లు ఆర్డీవో అకౌంట్లో వేయిస్తామని చెప్పారన్నారు. ఇప్పటి వరకు తమకు ఒక్క రూపాయి కూడా అందలేదన్నారు. 2022లో కలెక్టర్ భవేష్ మిశ్రా తమకు హామీ ఇస్తూ నెలరోజుల్లో న్యాయం చేస్తానని చెప్పారని గుర్తుచేశారు. అయినా ఇంకా న్యాయం జరగలేదన్నారు. కనీసం సింగరేణి యాజమాన్యం ల్యాండ్ లూసర్‌లకు కల్పించే కనీస సౌకర్యాలు తమకు కల్పించడంలేదని అన్నారు. ఓసీ-2 ప్రాజెక్ట్ బ్లాస్టింగ్ వల్ల ఏర్పడే దుమ్మూధూళితో క్యాన్సర్, గుండె జబ్బులు, ఊపిరితిత్తుల వ్యాధుల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ప్రభుత్వం ద్వారా రైతు బంధు' వర్తించడంలేదని తమ భూములన్నీ సింగరేణి పేరిట నమోదయ్యాయని తెలిపారు. వెంటనే సింగేణి అధికారులు తమ కాలనీని ఆకుదారివాడ, ఫక్కీర్‌గడ్డ నుంచి తరలించి తమకు నష్టపరిహారం చెల్లించకపోతే తాడో పేడో తేల్చుకుంటామని హెచ్చరించారు. వెంటనే ప్రిలిమినరీ నోటిఫికేషన్(పీఎన్) వేసి తమను వేరేచోటుకు తరలించాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే సీఎం, సీఅండ్ఎండీ దృష్టికి తీసుకెళ్లి తమకు న్యాయం చేయాలన్నారు.

పనులను అడ్డుకోవద్దు : జీఎం

భూనిర్వాసితులతో జీఎం శ్రీనివాసరావు తన చాంబర్‌లో సమావేశమయ్యారు. బొగ్గు ఉత్పత్తి పనులను అడ్డుకుంటే సమస్యలు పరిష్కారం కావన్నారు. భూనిర్వాసితుల సమస్యను ఎమ్మెల్యే, కలెక్టర్, సీఎండీ దృష్టికి తీసుకెళ్లి త్వరగా పరిష్కరించేందుకు కృషిచేస్తామన్నారు. దీనిపై నిర్వాసితులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇలా ఎన్ని రోజులు తమను మభ్యపెడతారని ప్రశ్నించారు. గతంలో ఆర్డీవో ఖాతాలో రూ.22కోట్లు వేశామని చెప్పారు గానీ ఎందుకు చెల్లించలేదని అడిగారు. దీనిపై జీఎం సమాధానం ఇస్తూ నోట్ అప్రూవ్ అయింది గానీ అమౌంట్ డిపాజిట్ కాలేదని తెలిపారు. భూములు సేకరించినప్పుడు ఉన్న నిర్మాణాలకంటే ప్రస్తుత అక్కడ కొత్త ఇళ్లు వెలిశాయని, దీంతో పరిహారం చెల్లించడంలో జాప్యం జరుగుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి అధికారులు వెంకట్రామిరెడ్డి, కృష్ణప్రసాద్, కార్తీక్, తుకారాం, భూనిర్వాసితులు రమేష్, రాజు, కొమురయ్య, మధుసూదన్, హతీరాం, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ఏర్పాటు

వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ శాంతికుమారి

6లో

హైదరాబాద్‌లో జిల్లా విద్యార్థిని ఆత్మహత్య

- వెంకటాపురం మండలం ఆలుబాకలో విషాదఛాయలు
- యువతి మృతికి కారణమైన వ్యక్తిని అరెస్టు చేయాలంటూ ఆందోళన
- మృతదేహంతో ర్యాలీ నిర్వహించిన కుటుంబికులు, స్థానికులు

స్త్రీ శిశు సంక్షేమ అధికారులకు పురస్కారం



పురస్కారం అందుకున్న డీడబ్ల్యూవో, సీడీపీవో, సూపర్‌వైజర్, అంగన్‌వాడీ టీచర్

ములుగు, మార్చి 14: స్త్రీ శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారులకు రాష్ట్రస్థాయి ఉమెన్ అచీవ్‌మెంట్ పురస్కారం దక్కింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో గురువారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర స్త్రీ శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క చేతుల మీదుగా డీడబ్ల్యూవో స్వర్ణలత లెనీనా, ఏటూరునాగారం సీడీపీవో వి.హేమలత, ములుగు సూపర్‌వైజర్‌సైకం సరస్వతి, వస్రా-4 అంగన్‌వాడీ పద్మారాణి అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి వీరిని శాలువాలతో సత్కరించారు. జిల్లాకు చెందిన నలుగురికి రాష్ట్రస్థాయి అవార్డులు రావడం పట్ల ఆ శాఖ అధికారులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్‌తోనే గ్రామీణాభివృద్ధి సాధ్యం

ఎమ్మెల్యే సత్యనారాయణరావు



మెట్టుపల్లిలో పెద్దచెరువు మరమ్మతు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

మొగుళ్లపల్లి, మార్చి 14: కాంగ్రెస్‌తోనే గ్రామీణాభివృద్ధి సాధ్యమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని మెట్టుపల్లిలో రూ.22 లక్షల 70వేల నిధులతో చేపట్టనున్న పెద్ద చెరువు, పెదకోమటిపల్లి గ్రామంలో రూ.25లక్షల 75వేలతో చేపట్టనున్న పెద్దచెరువు మరమ్మతు పనులకు ఆయన గురువారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సౌకర్యాలతోపాటు అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేవిధంగా చూస్తానని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి నిత్యం కృషి చేస్తానని, ప్రజలు ఐకమత్యంతో ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీ టీసీ జోరుక సదయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆకుతోట కుమారస్వామి, నాయకులు దండ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎర్రబెల్లి పున్నంచందర్‌రావు, పోలినేని లింగారావు, ఖ్యాతరాజు రమేష్, తక్కళ్లపల్లి రాజు, నడిగోటి రాము, ఎమ్డీ.రఫీ, సదాశివరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

టేకుమట్ల: రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో చెరువుల మరమ్మతు పనులను ఆయన గురువారం ప్రారంభించారు. వెల్లంపల్లి గ్రామంలోని ఊర చెరువు, సోమనపల్లి గ్రామంలోని తాళ్లకుంట మరమ్మతులకు రూ.33.10 లక్షలు మంజూరు కాగా పనులు ప్రారంభించారు. అనంతరం మండలంలోని గర్మిళ్లపల్లి గ్రామంలోని అంబేద్కర్ భవన్ ప్రహరీ, సుబ్బక్కపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ప్రహరీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. పెద్దంపల్లి గ్రామంలో రూ.10లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. గత ఏడాదిలో అధిక వర్షాల కారణంగా మండలంలోని చాలా గ్రామాల్లోని చెరువులు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. రైతులకు సాగునీరు ఇబ్బందులు లేకుడా ఉండాలంటే చెరువుల మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. దెబ్బతిన్న ప్రతి చెరువునూ మరమ్మతులు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ టీసీ పులి తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్, మండల ప్రధాన కార్యదర్శి దాసారపు సదానందం, జిల్లా ప్రధాన కార్యదర్శులు తిప్పిరెడ్డి కృష్ణారెడ్డి, వైనాల రవీందర్, మండల ఉపాధ్యక్షుడు మోతే రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఇంటర్ పరీక్షలు



పరీక్షలు ముగిసిన ఆనందంలో ఇంటర్ విద్యార్థినులు

భూపాలపల్లిటౌన్, మార్చి 14: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. గురువారం ద్వితీయ సంవత్సరానికి సంబంధించిన రసాయన శాస్త్రం-2, వాణిజ్య శాస్త్రం-2, ఒకేషనల్ విద్యార్థులకు జీవశాస్త్రం-2, గణితం -2, బ్రిడ్జికోర్సు పరీక్షలు జరిగాయి. జిల్లాలోని ఎనిమిది కేంద్రాల్లో పరీక్షలు జరగ్గా 1,540 మంది విద్యార్థులకు 1495 మంది హాజరయ్యారు. 45 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు నోడల్ అధికారి దేవరాజన్ తెలిపారు. అయితే ఒకే రోజు పలు పరీక్ష కేంద్రాల్లో 27 మంది మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడ్డ సంఘటన మినహా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా జరిగినట్లు తెలిపారు. అలాగే ఒకేషనల్ విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ సంవత్సరం భౌతిక, రసాయన శాస్త్రం పేపర్లు శుక్ర,శనివారాల్లో ఉంటాయని తెలిపారు. కలెక్టర్ భవేష్ మిశ్రా, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు అన్ని పరీక్షలు సజావుగా జరిగేలా చేశామన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ వసుధ



సమావేశంలో మాట్లాడుతున్న బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ వసుధ

ములుగు కలెక్టరేట్, మార్చి 14: బాలికల అభివృద్ధికి బాల్య వివాహాలు విఘాతంగా మారుతున్నాయని, వాటిని పూర్తిగా అరికట్టేందుకు ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలని బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ కె.వసుధ అన్నారు. జిల్లా కేంద్రంలోని సఖి కేంద్రంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఓంకార్ అధ్యక్షతన బాల్య వివాహాల నిషేదం, అక్రమ దత్తత నిషేధ చట్టాలపై ఐసీడీఎస్ సిబ్బందితో గురవారం జరిగిన సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బాలికలకు పుస్తెలబంధం కాకుండా పుస్తకాలతో బంధం ఉన్నప్పుడే వారి భవిష్యత్తు బంగారుమయం అవుతుందని అన్నారు. బాల్య వివాహానికి గురైన బాలికలు శారీరకంగా, మానసికంగా, ఆరోగ్యపరంగా, సామాజికంగా, ఎదుగుదల విషయంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవడం బాధాకరమని అన్నారు. దేశంలో నాగరికంగా ఎంతో అభివృద్ధి చెందుతున్నా ఇప్పటికీ మారుమూల గ్రామాల్లో బాల్య వివాహాలు జరుగుతూనే ఉన్నాయని అన్నారు. బాల్య వివాహాలు జరిగితే అందుకు కారకులైన తల్లిదండ్రులు, పెళ్లికొడుకు, అతనికి సహకరించిన వారందరిపై చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. రాబోయే కాలంలో పెళ్లిళ్లకు ముహూర్తాలు ఉన్న బాల్య వివాహాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉందని, అధికారులు, సిబ్బంది వాటిని నిర్మూలించాల్సిన అవసరం ఉందని సూచించారు. అదేవిధంగా బాల్య వివాహాల నిర్మూలన, బాలల హక్కుల పరిరక్షణ కోసం ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ఈ సమావేశంలో తాడ్వాయి సీడీపీవో మల్లీశ్వరి, ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎన్.హరికృష్ణ, డీసీపీయూ ప్రొటెక్షన్ ఆఫీసర్ కృష్ణవేణి, లీగల్ ఆఫీసర్‌లు సంజీవ, సుమన్, రాజు, నరేష్, సదయ్య, డీసీపీయూ సిబ్బంది శిరీష, స్రవంతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

భూపాలపల్లి కలెక్టర్ భవేష్ మిశ్రా



మాట్లాడుతున్న కలెక్టర్ భవేష్ మిశ్రా

భూపాలపల్లి కలెక్టరేట్, మార్చి 14: ఈనెల 18 నుంచి ఏప్రిల్ 2 వరకు జరగనున్న పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. పదో తరగతి పరీక్ష ఇన్విజిలేటర్లు, చీఫ్ సూపరింటెండెంట్లతో ఆయన గురువారం సమావేశమయ్యారు. పరీక్షల నిర్వహణపై సమీక్షించారు. జిల్లా వ్యాప్తంగా 20 పరీక్ష కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు జరగనున్నాయని తెలిపారు.మొత్తం 3,547 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్షలు జరుగుతాయని, గంట ముందే విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారని అన్నారు. పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లపై సంబంధిత అధికారులు నివేదికలను అందజేయాలన్నారు. 20 పరీక్ష కేంద్రాలకు 20 మంది చొప్పున సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్స్, సిట్టింగ్ స్క్వాడ్లను నియమించామని, వీరితో పాటు 200 మంది ఇన్విజిలేటర్లు పరీక్ష కేంద్రాల్లో విధులు నిర్వర్తిస్తారని వివరించారు. పరీక్షలు ముగిసేంతవరకు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలన్నారు. ప్రశ్న పత్రాలను భారీ భద్రత నడుమ క్లోజ్డ్ వాహనాల్లో తరలించాలన్నారు.

పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేయాలన్నారు. 100 మీటర్లలోపు జిరాక్స్ సెంటర్లను మూసివేయించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఈవో రాంకుమార్, పరీక్ష విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ ఉచిత కోచింగ్‌కు దరఖాస్తులు

కేయూ క్యాంపస్, మార్చి 14: జిల్లా షెడ్యూల్ కులాల అధ్యయన, అభివృద్ధి సంస్థల నేతృత్వంలో రెండు నెలల పాటు 100 మంది నిరుద్యోగ యువతకు ఉచిత వసతితో కూడిన శిక్షణ ఇచ్చేందుకుగాను ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఎస్సీ స్టడీ సర్కిల్ ఉమ్మడి వరంగల్ జిల్లా గౌరవ సంచాలకుడు డాక్టర్ కె.జగన్‌మోహన్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఏప్రిల్ 3 నుంచి జూన్ 2 వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు బీఎడ్, డైట్, టెట్ ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు http://tsstudycircle.-co.in/ వెబ్‌సైట్‌లో మార్చి 24 వరకు దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

బీసీ విద్యార్థులకు ఉచిత శిక్షణ

హనుమకొండ కలెక్టరేట్, మార్చి 14: హైదరాబాద్ స్కూల్ ఆఫ్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ద్వారా హైదరాబాద్‌లో బీసీ విద్యార్థులకు బ్యాంకింగ్, ఫైనాన్స్‌లో రెండు నెలలు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ ఎంపీవీ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్, హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, జనగామ, ములుగు జిల్లాలకు చెందిన అర్హులైన నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 0870-2571192, 040-29303130 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

అంగన్‌వాడీ మండల కమిటీ ఎన్నిక


నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

కాజీపేట, మార్చి 14 : తెలంగాణ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ కాజీపేట మండల నూతన కమిటీ గురువారం ఎన్నిక జరిగింది. అధ్యక్షురాలుగా కె.రమాదేవి, కార్యదర్శిగా ఎం.కవిత, కోశాధికారిగా పి.శారద, ఉపాధ్యక్షురాలుగా ఎం.అరుణ, టి.శ్రీదేవి, సహాయ కార్యదర్శిగా డి.లలిత ఎన్నికయ్యారు. అంతకు ముందు సో మిడి సెక్టార్ లీడర్లుగా ఎం.కవిత, డి.బాలశ్రీ, పి.రఘుకుమారి, మడికొండ సెక్టార్‌కు పి.వెంకటలక్ష్మి, పి.శారద, కె.రాజ్యలక్ష్మి, దర్గా సెక్టార్‌కు టి.జ్ఞానసుందరి, ఎం. అరుణ, కె.రజనీలను ఎన్నుకున్నారు.

16న నిరుద్యోగ యువతకు జాబ్ మేళా

వరంగల్ క్రైం, మార్చి 14: వరంగల్ కమిషనరేట్ పోలీసుల ఆధ్వర్యంలో ఈ నెల 16న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టీయంఐ ఫౌండేషన్ సహకారంతో నిర్వహిస్తున్న జాబ్‌మేళాను కమిషనరేట్ పరిధిలోని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని సీపీ సూచించారు. హనుమకొండలోని కాకతీయ డిగ్రీ కళాశాలలో ఉదయం 10గంటలకు ప్రారంభమయ్యే జాబ్ మేళాలో 3వేలకు పైగా ప్రముఖ కంపెనీలు ఉద్యోగ నియామకాలు చేపడతాయన్నారు. జాబ్‌మేళాకు హాజరయ్యే యువత.. కనీసం 10వతరగతి పూర్తి చేసి ఉండాలన్నారు. జాబ్ మేళాకు హాజరయ్యే యువత ముందస్తుగా సంబంధిత వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అంబర్ కిషోర్ ఝా సూచించారు.

బీఆర్ఎస్, బీఎస్పీ పొత్తు.. రహస్యమేంటి?

- ఇమడలేకనే బీఆర్ఎస్ వీడుతున్నా: కోనేరు కోనప్ప
- మంత్రి సీతక్క సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక



కాగజ్‌నగర్, మార్చి 14: బీఆర్ఎస్, బీఎస్పీతో పొత్తుపెట్టుకోవటం వెనుక రహస్య ఒప్పందం ఏంటని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల్లో తనపై లేనిపోని ఆరోపణలు చేసి ఓడించిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌తో బీఆర్ఎస్ జత కట్టడం ఇమడలేకనే ఆ పార్టీని వీడుతున్నట్టు ప్రకటించారు. గురువారం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క సమక్షంలో కోనప్ప కాంగ్రెస్‌లో చేరారు. ఆయనతో పాటు జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు, మునిసిపల్ చైర్‌పర్సన్ షహీన్ సుల్తానా, వైస్ చైర్మన్ రాజేందర్‌తోపాటు పలువురు ఎంపీపీలు, జెడ్పీటీసీలు కూడా కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా కోనప్ప మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్‌పై తనకు ఎలాంటి కోపం లేదన్నారు. తనకు ఎలాంటి పదవులు వద్దని, కేవలం సిర్పూరు నియోజకవర్గ అభివృద్ధి చాలని వ్యాఖ్యానించారు. అనంతరం సీతక్క మాట్లాడుతూ.. సిర్పూరు నియోజవర్గ సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తామని హామీనిచ్చారు.

బీఆర్ఎస్‌కు పెద్దిరెడ్డి రాజీనామా

హుజూరాబాద్, హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి తరువాత కీలక నేతలు పార్టీని వీడుతున్నారు. తాజాగా కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ నియోజకవర్గానికి చెందిన మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి పార్టీకి రాజీనామా చేశారు. తన ఆత్మగౌరవం దెబ్బతినే విధంగా అధిష్ఠానం వ్యవహార శైలి ఉందని, అది నచ్చకనే పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నానని ఆయన తెలిపారు. ఈ మేరకు గురువారం రాజీనామా లేఖను మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పంపించారు. పార్టీ సంస్థాగత నిర్మాణం, రాజకీయాలపై సుదీర్ఘ అనుభవం కలిగిన తనకు పార్టీలో సముచిత గౌరవం లభించలేదని పెద్దిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కార్యకర్తలు, అభిమానులతో మాట్లాడి భవిష్యత్తు కార్యాచరణను త్వరలోనే ప్రకటిస్తానన్నారు. కాగా ఆయన అధికార కాంగ్రెస్‌లో చేరతారని సమాచారం.

ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో ముగ్గురు

మహబూబ్‌నగర్, మార్చి14: మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు నామినేషన్ల ఉపసంహరణ గడువు గురువారంతో ముగిసింది. ఉపసంహరణ గడువు ముగిసే సమయానికి ముగ్గురు అభ్యర్థులు మాత్రమే పోటీలో నిలిచారు. మొత్తం 16మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. పరిశీలనలో ముగ్గురి దరఖాస్తులను అధికారులు తిరస్కరించారు. 10 మంది అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. కాంగ్రెస్ నుంచి మన్నె జీవన్ రెడ్డి, బీఆర్ఎస్ నుంచి నవీన్‌కుమార్ రెడ్డి, స్వతంత్ర అభ్యర్థి సుదర్శన్‌గౌడ్ బరిలో నిలిచారు. 28న ఎన్నిక జరగనుంది.

మంత్రి కోమటిరెడ్డిని కలిసిన జానారెడ్డి

- రఘువీర్‌రెడ్డి విజయానికి సహకరించాలని విజ్ఞప్తి

హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో నల్లగొండ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేస్తున్న రఘువీర్‌రెడ్డి విజయం కోసం సహకరించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని మాజీ మంత్రి జానారెడ్డి కోరారు. గురువారం బంజారాహిల్స్‌లోని మంత్రి నివాసానికి వెళ్లిన జానారెడ్డి తన కుమారుడు రఘువీర్‌రెడ్డిని ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. మూడు దశాబ్దాలుగా రాజకీయాల్లో తమ మధ్య ఉన్న అనుబంధాన్ని ఇరువురు నేతలు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. రఘువీర్‌కు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని, ఆయన్ను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని మంత్రి కోమటిరెడ్డి హామీ ఇచ్చారు.

ఆటోడ్రైవర్ల సమస్యలపై నిర్లక్ష్యం వీడాలి: హరీశ్

హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్ల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఆటో నడవడం లేదని మనస్తాపంతో నిజామాబాద్‌లో ఓ సోదరుడు తన భార్యతో సహా ప్రాణాలు తీసుకున్న హృదయ విదారక ఘటన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కదిలించకపోవడం బాధాకరమని గురువారం ఎక్స్(ట్విటర్) వేదికగా ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులను కోల్పోయి అనాథగా మారిన వారి బిడ్డ భవిష్యత్‌కు ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ఆ కుటుంబానికి వెంటనే రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలన్నారు. అలాగే ఆటోడ్రైవర్ల జీవనసమస్యకు పరిష్కారం చూపాలని, వారికి రూ.12వేల భృతి ఇవ్వాలని హరీశ్‌రావు కోరారు. కాగా, డీఎస్సీ పరీక్షలకు ముందే టెట్ నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించడం సంతోషకరమని మరో ట్వీట్‌లో హరీశ్ పేర్కొన్నారు.

డీకే శివకుమార్‌ను కలిసిన మల్లారెడ్డి

తనయుడితో కలిసి బెంగళూరుకు.. కర్ణాటక డిప్యూటీ సీఎంతో భేటీ

పార్టీ మారుతున్నారనే ఊహాగానాలు.. వ్యాపార లావాదేవీలేనన్న మల్లారెడ్డి

హైదరాబాద్/మేడ్చల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి గురువారం బెంగళూరులోని ఒక హోటల్లో కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను కలిశారు. మల్లారెడ్డి తనయుడు భద్రారెడ్డి కూడా వెంట ఉన్నారు. బీఆర్ఎస్ నుంచి పలువురు నేతలు కాంగ్రెస్‌లోకి చేరుతున్న నేపథ్యంలో మల్లారెడ్డి భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. శుక్రవారం ఢిల్లీలో కాంగ్రెస్ ముఖ్యనేత ప్రియాంకగాంధీని కలిసేందుకు అవకాశం ఇప్పించమని మల్లారెడ్డి కుటుంబసభ్యులు డీకేను కోరినట్లు సమాచారం. గత వారమే మల్లారెడ్డి, అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డితో కలిసి సీఎం సలహాదారు అయిన వేంనరేందర్‌రెడ్డితో భేటీ అయ్యారు. అప్పుడే ఇద్దరు ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని ప్రచారం జరిగింది. దాంతో కేటీఆర్ మల్లారెడ్డిని తన నివాసానికి పిలిపించుకుని మాట్లాడారు. తనకు కాంగ్రెస్‌లోకి వెళ్లే ఆలోచన లేదని మల్లారెడ్డి కేటీఆర్‌కు చెప్పారు. ఆ మాట చెప్పి వారం గడవక ముందే డీకే శివకుమార్‌తో భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. పార్టీ మారుతున్నట్లు వచ్చిన ఆరోపణలను మల్లారెడ్డి ఖండించారు. తాను బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానన్నారు. బెంగళూరుకు ఒక ఫంక్షన్‌కు వచ్చానని, అక్కడ ఒక ప్రైవేటు వర్సిటీ అమ్మకానికి ఉందని ఫ్రెండ్ చెబితే దాని కొనుగోలు గురించి మాట్లాడటానికి మధ్యవర్తి ద్వారా డీకే శివకుమార్‌ను కలిశానని తెలిపారు. , రాజకీయాలేవీ మాట్లాడలేదన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి 75 ఏళ్లు దాటుతాయని, ఆ ఎన్నికల్లో పోటీచేసే ఉద్దేశం తనకు లేదని స్పష్టం చేశారు. ఈ ఐదేళ్లు బీఆర్ఎస్‌లోనే ఉంటూ ఎమ్మెల్యేగా ప్రజలకు సేవ చేస్తానని చెప్పారు. మల్లారెడ్డి డీకే శివకుమార్ దగ్గరే ఆగిపోకుండా ప్రియాంకగాంధీ అపాయింట్‌మెంట్ అడగడం ఊహాగానాలకు తావిస్తోంది. ఆస్తులను కాపాడుకోవడానికి కాంగ్రెస్‌లోకి వెళ్లడమే మార్గమని మల్లారెడ్డి భావిస్తున్నారని కాంగ్రెస్‌లోని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. మల్లారెడ్డి రాకను మేడ్చల్ కాంగ్రెస్ నేతలు మైనంపల్లి హన్మంతరావు, సుధీర్ రెడ్డి, వజ్రేష్‌యాదవ్, హరివర్ధన్‌రెడ్డి, నక్క ప్రభాకర్ గౌడ్ వ్యతిరేకిస్తున్నారు. రేవంత్ సన్నిహితుడిని కలిసినా చేరిక పని కాకపోవడంతో మల్లారెడ్డి బెంగళూరు వైపు నుంచి నరుక్కొస్తున్నారని భావిస్తున్నారు.

ఆపరేషన్ రేవంత్!

(మొదటిపేజీ తరువాయి)

తెలుస్తోంది. రేవంత్ ఆయన సహచర బృందం కదలికలను గుర్తించడంతో పాటు ఎన్నికల్లో కాంగ్రెస్‌కు డబ్బులు ఎక్కడినుంచి, ఏయే మార్గాల్లో, ఎవరెవరు సర్దుబాటు చేస్తున్నారు..? అనే వివరాలను ప్రణీత్ ట్యాపింగ్ చేశారు. ముఖ్యంగా ఎన్నికలకు కొద్ది నెలల ముందు నుంచి రేవంత్‌తో పాటు ఆయనకు అత్యంత సన్నిహితులు, సహకరించే అందరి ఫోన్‌లపైనా ట్యాపింగ్ కొనసాగినట్లు ఆధారాలు లభించినట్లు తెలిసింది. అప్పటి అధికార పార్టీ బీఆర్ఎస్ ఆదేశాల మేరకు నడుచుకున్న ప్రణీత్.. రాజకీయ నాయకులు, పోలీసులతో పాటు ప్రైవేటు వ్యక్తుల సహకారం కూడా తీసుకున్నారు. ఎక్కడికక్కడ తమకు అందుతున్న సమాచారం, ఫోన్ నంబర్ల ఆధారంగా ఎస్ఐబీ ప్రధాన కార్యాలయం, ఇతర వార్ రూంల నుంచి రోజుల వ్యవధిలోనే వందల ఫోన్‌ల ట్యాపింగ్‌కు పాల్పడ్డారు. హార్డ్ డిస్కుల ధ్వంసం, కీలక పత్రాల దహనం కేసు దర్యాప్తులో భాగంగా ప్రణీత్ ఫోన్‌లోని వాట్సాప్ చాటింగ్‌లను దర్యాప్తు అధికారులు పరిశీలించగా బీఆర్ఎస్ నేతలతో పాటు ప్రైవేటు వ్యక్తుల నుంచి వచ్చిన సందేశాలను పరిశీలించారు. ఎన్నికల్లో డబ్బులు ఎవరెవరి చేతులు మారుతున్నాయన్న సమాచారం గుర్తించి కట్టడి చేశారని స్పష్టమైంది. అరెస్టు సమయంలో ప్రణీత్‌రావును ప్రాథమికంగా విచారించగా ఒక ఎస్పీ, ఎస్ఐబీ అప్పటి చీఫ్ ఆదేశాల మేరకే తాను, తన బృందం పనిచేసినట్లు వెల్లడించినట్లు తెలిసింది. ప్రణీత్‌ను కస్టడీకి తీసుకుని విచారించేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు. ఏడు రోజుల కస్టడీ



ప్రణీత్‌రావు (ఫైల్)

కోరుతూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కాగా, ప్రణీత్‌రావు కేసుకు సంబంధించి ఇప్పటివరకు జరిగిన దర్యాప్తుపై సీఎం రేవంత్ పోలీసు ఉన్నతాధికారుల నుంచి ఆరా తీసినట్లు సమాచారం. దీంతో వారు సమగ్ర నివేదిక అందించారని తెలిసింది. ప్రణీత్ వ్యవహారంలో వెలుగులోకి వచ్చిన వ్యక్తుల పేర్లు.. అనుసరించాల్సిన విధానాలపై సీఎంకు వివరించినట్లు సమాచారం. చట్ట వ్యతిరేకంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేసినట్లు తెలిసింది.

ఉన్నతాధికారుల చుట్టూ ఉచ్చు

ప్రణీత్‌తో అంటకాగి కుట్రలో భాగస్వాములైన ఎస్ఐబీ అప్పటి ఉన్నతాధికారులను నేడో రేపో విచారించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. పంజాగుట్ట పోలీసులు వారికి నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. ఎన్నికల ముందు పనిచేసినవారిపై దృష్టిపెట్టినట్లు సమాచారం. కొన్ని నియోజకవర్గాల్లో అధికారులు వారి ఇళ్లలోనే ప్రత్యేక గదుల్లో (వార్ రూమ్‌లు) ఏర్పాట్లు చేసి, ట్యాపింగ్‌కు పాల్పడినట్లు గుర్తించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వీటిని సిద్ధం చేసిన ప్రణీత్‌కు పలువురు సహచరులూ సహకరించినట్లు తెలుస్తోంది. మూడు నియోజకవర్గాల్లో విజిలెన్స్‌లో పనిచేస్తున్న ఇద్దరు, ఎస్ఐబీ అధికారి ఇళ్లలో వార్ రూమ్‌లను ఏర్పాటు చేసి, ప్రముఖుల ఫోన్‌లను ట్యాప్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఎన్నికల సందర్భంగా ఓ పార్టీ నిధుల తరలింపులోనూ ప్రణీత్ కీలక పాత్ర పోషించారని అనుమానిస్తున్నారు. డబ్బు, బంగారం, వస్తువులను చేరవేసేందుకు సొంత, ఎస్ఐబీ, గ్రేహౌండ్స్ వాహనాలను వినియోగించారనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. ప్రణీత్ ఫోన్ నుంచి కీలక వివరాలు సేకరించే పనిలో సైబర్ నిపుణులు ఉన్నారు. ఆయన తొలగించిన డేటాను రిట్రీవ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇది బయటకు వస్తే మరింతమంది అరెస్టయ్యే అవకాశముందని చెబుతున్నారు. ఇప్పటికే ఎస్ఐబీ లాగర్ రూమ్‌లో పనిచేసిన ఇన్‌స్పెక్టర్, ఎస్సైలను విచారించారు.

ట్యాపింగ్ చేయమన్నది ఎవరు?

ట్యాపింగ్‌కు ఎవరు ప్రోత్సహించారు? ఎలాంటి సమాచారం సేకరించారు? ఎవరి పాత్ర ఎంత? అనే ప్రశ్నలకు ప్రవీణ్ స్పష్టంగా సమాధానం ఇచ్చారని తెలుస్తోంది. ఈ మేరకు పంజాగుట్ట పోలీసులు స్టేట్‌మెంట్ రికార్డు చేసి, సాంకేతిక ఆధారాలను సేకరించారు. ప్రణీత్ ఫోన్ డేటా విశ్లేషించి, ఏయే నంబర్లతో ఎంత మందితో టచ్‌లో ఉన్నారో తెలుసుకున్నారు. ఎవరెవరి ఫోన్‌లు ఎంత కాలం ట్యాప్ చేశారు? తదితర అంశాలను దర్యాప్తు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వార్ రూమ్‌లకు ఈ డేటాను అందించినట్లు అంచనాకు వచ్చారు. డేటాను కాపీ చేసిన హార్డ్ డిస్కులు ఎక్కడున్నాయో దర్యాప్తు చేస్తున్నారు.

ప్రత్యేక బ్యారెక్.. పకడ్బందీ భద్రత

ప్రణీత్‌ను విచారించి ఆధారాలు, సమాచారం రాబట్టేందుకు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ గురువారం నాంపల్లి కోర్టులో పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని ప్రణీత్ న్యాయవాదులకు జడ్జి సూచించారు. శుక్రవారం వాదనలు జరిగే అవకాశముంది. కాగా, పోలీసుల అదుపులో ఉన్న ఆయనను బుధవారం రాత్రి చంచల్‌గూడ జైలుకు రిమాండ్‌కు తరలించారు. ప్రణీత్‌ను భద్రతా కారణాల దృష్ట్యా ప్రత్యేక బ్యారెక్‌లో ఉంచారు. సీసీ కెమెరా నిఘాతో పాటు నిరంతరం జైలు సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. అటువైపుగా ఇతర ఖైదీలను అనుమతించడం లేదు. గురువారం ఉదయం ప్రణీత్ తరపు న్యాయవాది అనుదీప్, సోదరుడు వంశీ ములాఖాత్ అయ్యారు.

కాంగ్రెస్‌లోకి జితేందర్‌రెడ్డి!

(మొదటిపేజీ తరువాయి)

సీఎం రేవంత్‌రెడ్డి గురువారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి జితేందర్ నివాసానికి వెళ్లి అరగంట పాటు సమావేశమయ్యారు. ఇది జితేందర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరబోతున్నారన్న ప్రచారానికి మరింత ఊతమిచ్చినట్లైంది. మరోవైపు ఈ పరిణామం మహబూబ్‌నగర్ జిల్లాలోనూ కలకలం రేపింది. సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవలి వరకు ప్రాతినిధ్యం వహించిన మల్కాజిగిరిలో కాంగ్రెస్ నుంచి జితేందర్‌రెడ్డి పోటీ చేస్తారని పెద్దఎత్తున చర్చ జరిగింది. ఇక గురువారం సాయంత్రం మహబూబ్‌నగర్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. సీఎం వెళ్లి కలిశారంటేనే పార్టీలోకి ఆహ్వానించడానికి కాదా? అని వ్యాఖ్యానించారు. జితేందర్‌రెడ్డి మనస్తత్వం తనకు తెలుసని, ఎంపీగా రాష్ట్ర సమస్యల పరిష్కారానికి కృషి చేశారని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి పనిచేస్తే బీజేపీ మోసం చేసిందని ఆరోపించారు.

ఎన్నికల్లో పోటీ చేయను..

తాను ఎన్నికల్లో పోటీ చేయడం లేదని జితేందర్‌రెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. రేవంత్‌తోనూ ఎన్నికల్లో పోటీపై చర్చించలేదని స్పష్టంచేశారు. నిత్యం ప్రజల్లో ఉండే తనకు బీజేపీ టికెట్ రాకపోవడంతో సీఎం బాధపడ్డారని చెప్పారు. 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనం చూసి రేవంత్‌రెడ్డి వచ్చినట్లు చెప్పారు. తన భవిష్యత్తును పార్టీ అధినాయకత్వమే చూసుకుంటుందని చెప్పారు. కాగా, జితేందర్‌రెడ్డికి ప్రధాని మోదీ, అమిత్‌షాతో సన్నిహిత సంబంధాలున్నాయి. అయితే, తనకు టికెట్ రాలేదని తెలిసి ఓదార్చేందుకే.. సొంత జిల్లా వాసి అయిన రేవంత్ వచ్చి కలిశారని చెప్పినా మహబూబ్‌నగర్ బీజేపీ, కాంగ్రెస్ వర్గాల్లో మాత్రం పార్టీ మార్పు ఊహాగానాలు పెద్దఎత్తున సాగాయి.

అరుణ ప్రెస్‌మీట్‌లో జితేందర్ కుమారుడు

మహబూబ్‌నగర్ బీజేపీ అభ్యర్థిగా డీకే అరుణ పేరును ప్రకటించాక జితేందర్‌రెడ్డి కుమారుడు మిథున్‌రెడ్డి ఆమె నివాసానికి వెళ్లి అభినందలు తెలిపారు. గురువారం జితేందర్‌రెడ్డి నివాసానికి సీఎం రేవంత్ వెళతారని ప్రచారం జరుగుతున్న సమయంలోనే పాలమూరులో అరుణ మీడియా సమావేశం నిర్వహించారు. ఇందులోనూ మిథున్‌రెడ్డి పాల్గొనడం గమనార్హం.

నేడు హైదరాబాద్‌కు ప్రధాని మోదీ

(మొదటిపేజీ తరువాయి)

పర్యటించనున్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా రెండు రోజుల కిందట వచ్చి, సంస్థాగత బలోపేతంపై రాష్ట్ర పార్టీకి దిశానిర్దేశం చేశారు. బీజేపీ సోషల్ మీడియా వారియర్స్‌తో పాటు పార్టీ పోలింగ్ బూత్ అధ్యక్షులు, ఆ పైస్థాయి క్యాడర్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. బీజేపీ ముఖ్య నేతలతో భేటీ అయి పోలింగ్ బూత్‌ల పటిష్ఠత ఆవశ్యకతను వివరించారు. ఈ క్రమంలో ప్రధాని మోదీ శుక్రవారం మరోసారి రాష్ట్ర పర్యటనకు రానున్నారు. ఆయన మూడు రోజుల పాటు పార్టీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేయనున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు నగరంలో మోదీ రోడ్ షోను నిర్వహించినట్లుగానే ఈసారి కూడా బీజేపీ అదే విధంగా ప్లాన్ చేస్తోంది. మూడు పార్లమెంటు నియోజకవర్గాలకు కలిపి ఒక కేంద్రంలో ప్రధాని ఎన్నికల ప్రచారం కొనసాగించేలా రాష్ట్ర పార్టీ ప్రణాళిక రూపొందించింది. ఇందుకు అనుగుణంగా మల్కాజ్‌గిరి, సికింద్రాబాద్, హైదరాబాద్ సెగ్మెంట్లకు కలిపి శుక్రవారం సాయంత్రం 5 గంటలకు మల్కాజ్‌గిరి పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో జరిగే రోడ్ షోలో మోదీ పాల్గొంటారు. మీర్జాలగూడ నుంచి మల్కాజ్‌గిరి చౌరస్తా 1.3 కి.మీ మేర ఈ రోడ్ షోను భారీ ఎత్తున నిర్వహించేందుకు బీజేపీ ఏర్పాట్లు చేస్తోంది. శుక్రవారం సాయంత్రం 4.50 గంటలకు ప్రధాని ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. 5 గంటల నుంచి 6 గంటల వరకు రోడ్ షోలో పాల్గొంటారు. మల్కాజ్‌గిరి చౌరస్తాలో ప్రసంగిస్తారు. అనంతరం, ప్రధాని రాజ్‌భవన్‌కు వెళ్లి బస చేస్తారు. శనివారం ఉదయం 11 గంటలకు బయలుదేరి నాగర్‌కర్నూలులో నిర్వహించే బహిరంగ సభకు హాజరవుతారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూలు, నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గాలకు సంబంధించి ఈ సభను ఏర్పాటుచేశారు. అనంతరం గుల్బర్గా బయలుదేరి వెళతారు. తిరిగి 18న జగిత్యాలలో నిర్వహించే బహిరంగ సభలో ప్రధాని పాల్గొంటారు. కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ సెగ్మెంట్లకు సంబంధించి ఈ సభను ఏర్పాటు చేసినట్లు బీజేపీ వర్గాలు వివరించాయి.

రేవంత్‌కు అభద్రతా భావమెందుకు?: లక్ష్మణ్

కాంగ్రెస్‌కు మెజారిటీ ఎమ్మెల్యేలు ఉన్నప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు అభద్రతా భావంతో మాట్లాడుతున్నారని ఎంపీ లక్ష్మణ్ ప్రశ్నించారు. ఎంపీ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కారు ఏర్పాటుకు మార్గం సుగమమవుతుందని చెప్పారు. ఈ ప్రభుత్వం ఐదేళ్లు కొనసాగాలనే కోరుకుంటున్నామని.. కానీ నిలబెట్టుకోలేకపోతే వారి కర్మ అని అన్నారు. రాష్ట్రంలో 12కు పైగా స్థానాల్లో బీజేపీ విజయం ఖాయమని మాజీ ఎంపీ, చేవెళ్ల అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ ఓటమికి, ఆ పార్టీ పతనానికి అహంకారమే కారణమని మాజీ ఎంపీ, బీజేపీ మహబూబాబాద్ లోక్‌సభ అభ్యర్థి సీతారాం ఢిల్లీలో విమర్శించారు. ప్రజలే ఆ అహంకారాన్ని అణచివేశారని తెలిపారు.

పలు ప్రాజెక్టులకు అనుమతులు

హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వివిధ ప్రాజెక్టుల నిర్మాణాలకు పరిపాలనపర అనుమతులు ఇస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఖమ్మం జిల్లాలో మున్నేరు వాగుపై రూ.107.30 కోట్లతో ఆనకట్ట, నాగార్జున సాగర్ ఎడమకాలువపై రూ.35.75 కోట్లతో కొడుమూరు ఎత్తిపోతల పథకం రెండో దశ, కరీంనగర్ జిల్లాలోని కలువల వాగుపై చెక్‌డ్యామ్ నిర్మాణానికి అనుమతి ఇచ్చింది.

తెలంగాణలో కాంగ్రెస్‌దే హవా!

17 లోక్‌సభ స్థానాల్లో 10 ఆ పార్టీ ఖాతాలోకే.. బీజేపీ-4, బీఆర్ఎస్-2, మజ్లిస్-1

- ఏపీలో టీడీపీ కూటమికి ఘన విజయం
- 25 సీట్లలో 20 గెల్చుకునే అవకాశం
- ఉత్తరాదిన మళ్లీ బీజేపీ ప్రభంజనం
- పలు రాష్ట్రాల్లో కమలం క్లీన్ స్వీప్!
- ఏబీపీ-సీఓటర్ సర్వే అంచనాలు
- తెలంగాణలో బీజేపీ 8 సీట్లు గెలుస్తుందని నెట్‌వర్క్ 18 సర్వే వెల్లడి



న్యూఢిల్లీ, మార్చి 14: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ 10 స్థానాలను కైవసం చేసుకోనుందని ఏబీపీ- సీ ఓటర్ ఒపీనియన్ పోల్ అంచనా వేసింది. మొత్తం 17 స్థానాల్లో బీజేపీ 4, బీఆర్ఎస్ 2, ఎంఐఎం 1 స్థానం గెలవవచ్చని పేర్కొంది. కాగా, ఓట్ల విషయానికొస్తే.. కాంగ్రెస్ 43 శాతం, బీఆర్ఎస్ 28 శాతం, బీజేపీ 25 శాతం, ఎంఐఎం ఒక శాతం ఓట్లను దక్కించుకోవచ్చని ఈ సర్వే తెలిపింది. ఏపీలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి, వైసీపీ, కాంగ్రెస్‌ల మధ్య త్రిముఖ పోరు ఉంటుందని ఈ సర్వే వెల్లడించింది. మొత్తం 25 సీట్లలో టీడీపీ కూటమి 20 సీట్లను తమ ఖాతాలో వేసుకుంటుందని, వైసీపీ కేవలం 5 స్థానాలకే పరిమితమవుతుందని పేర్కొంది. ఓట్ల పరంగా కూటమికి 45 శాతం, వైసీపీకి 42 శాతం, కాంగ్రెస్‌కు 3 శాతం ఓట్లు లభిస్తాయని తెలియజేసింది. ఇతర రాష్ట్రాల విషయానికొస్తే ఈ సర్వే వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి.


తమిళనాడులో డీఎంకే-కాంగ్రెస్ స్వీప్

కర్ణాటకలో బీజేపీ-జేడీఎస్ కూటమి 23 సీట్లను, కాంగ్రెస్ ఐదు సీట్లను దక్కించుకుంటాయి. తమిళనాడులో మొత్తం 39 సీట్లనూ డీఎంకే-కాంగ్రెస్ కూటమి స్వీప్ చేయనుంది. కేరళలో ఉన్న 20 సీట్లలో 16 సీట్లు కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ గెల్చుకోనుంది. మిగిలిన నాలుగు సీట్లు వామపక్ష (ఎల్‌డీఎఫ్) కూటమి కైవసం చేసుకుంటుంది. బీజేపీకి ఒక్క స్థానం కూడా దక్కే అవకాశం లేదు. ఇక దేశంలోనే అతిపెద్ద రాష్ట్రం, అత్యధికంగా 80 సీట్లను కలిగి ఉన్న యూపీలో ఈసారి కూడా బీజేపీ హవా వీయనుంది. 74 స్థానాలను ఆ పార్టీ సారథ్యంలోని ఎన్‌డీఏ కైవసం చేసుకుంటుంది. ఎస్పీ-కాంగ్రెస్‌లకు ఆరుకు మించి లభించే అవకాశాల్లేవు. బిహార్‌లో మొత్తం 40 స్థానాలకుగాను ఎన్‌డీఏ కూటమి 32 స్థానాల్లో విజయకేతనం ఎగురవేసే అవకాశం ఉంది. మిగిలిన ఎనిమిది సీట్లకే ఇండియా కూటమి పరిమితం కావచ్చు. పంజాబ్‌లో మొత్తం 13 స్థానాలు ఉండగా, రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఆమ్‌ఆద్మీ పార్టీ ఆరు స్థానాలను గెల్చుకునే అవకాశాలున్నాయి. కాంగ్రెస్ 5, బీజేపీ, అకాలీదళ్ చెరో స్థానాన్ని ఖాతాలో వేసుకోవచ్చు. 14 సీట్లున్న జార్ఖండ్‌లో 12 ఎన్‌డీఏ కూటమికి, రెండు ఇండియా కూటమికి లభించవచ్చు. దేశ రాజధాని ఢిల్లీలో మొత్తం ఏడు సీట్లనూ బీజేపీ మరోసారి హస్తగతం చేసుకోనుంది. హరియాణాలో 10 స్థానాలకుగాను బీజేపీ 8, కాంగ్రెస్ 2 స్థానాల్లో విజయం సాధించే అవకాశాలున్నాయి. గుజరాత్ (26), రాజస్థాన్ (25), హిమాచల్ ప్రదేశ్ (4)లను బీజేపీ పూర్తిగా క్లీన్‌స్వీప్ చేయనుంది. ఇక ఈశాన్య రాష్ట్రాల్లో ఉన్న 11 స్థానాల్లో 9 బీజేపీ ఖాతాలోనే పడతాయని ఏబీపీ సీ ఓటర్ సర్వే అంచనా వేసింది. కాగా, నెట్‌వర్క్ 18.. 'మెగా ఒపీనియన్ పోల్' పేరుతో తెలంగాణలో తమ సర్వే వివరాలను గురువారం వెల్లడించింది. ఈ సర్వే ప్రకారం.. రాష్ట్రంలోని 17 సీట్లలో బీజేపీ 8 కైవసం చేసుకుంటుంది. కాంగ్రెస్ 6, బీఆర్ఎస్ 2, ఎంఐఎం ఒక స్థానంలో గెలిచే అవకాశాలున్నాయి. అయితే, ఓట్ల పరంగా కాంగ్రెస్ అత్యధికంగా 34 శాతం ఓట్లను దక్కించుకుంటుందని, బీజేపీకి 28 శాతం, బీఆర్ఎస్‌కు 27 శాతం, ఇతరులకు 11 శాతం ఓట్లు లభిస్తాయని ఈ సర్వే పేర్కొంది.

మల్కాజిగిరిలో రాగిడి లక్ష్మారెడ్డి

ఆదిలాబాద్‌లో ఆత్రం సక్కు.. మరో రెండు ఎంపీ స్థానాలకు బీఆర్ఎస్ అభ్యర్థులను ఖరారు చేసిన కేసీఆర్

హైదరాబాద్, ఆదిలాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో బరిలోకి దిగనున్న మరో ఇద్దరు బీఆర్ఎస్ అభ్యర్థులను ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ గురువారం ప్రకటించారు. మల్కాజిగిరి ఎంపీ స్థానానికి రాగిడి లక్ష్మారెడ్డి, ఆదిలాబాద్ స్థానానికి ఆత్రం సక్కు అభ్యర్థిత్వాలను ఆయన ఖరారు చేశారు. ఇప్పటికే ప్రకటించిన వాటితో కలిపి ఇప్పటి వరకు 11లోక్‌సభ స్థానాలకు బీఆర్ఎస్ తమ అభ్యర్థులను ప్రకటించింది. ఉప్పల్ టికెట్ రాకపోవడంతో రాగిడి లక్ష్మారెడ్డి అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరిన విషయం తెలిసిందే. అయితే మల్కాజిగిరి స్థానం నుంచి పలువురి పేర్లు ప్రచారంలో ఉన్నప్పటికీ అనూహ్యంగా రాగిడి లక్ష్మారెడ్డి అభ్యర్థిత్వాన్ని ప్రకటించడంపై పార్టీ శ్రేణుల్లో చర్చ జరుగుతోంది. ఆదిలాబాద్ పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించిన నేతలతో నందినగర్‌లోని తన నివాసంలో కేసీఆర్ గురువారం భేటీ అయ్యారు. ఆదిలాబాద్‌లో



రాగిడి లక్ష్మారెడ్డి ఆత్రంసక్కు

పార్టీ అభ్యర్థి ఎవరన్నదానిపై నేతలతో కేసీఆర్ సుదీర్ఘంగా చర్చించారు. ఈ క్రమంలో ఆదివాసీ ఉద్యమనేత, ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు టికెట్ ఇవ్వాలని నిర్ణయించారు. సిటింగ్ ఎమ్మెల్యేగా ఉన్న ఆయనకు ఇటీవలి శాసనసభ ఎన్నికల్లో అవకాశం ఇవ్వలేదు. అదేసమయంలో ఆయనకు లోక్‌సభకు అవకాశం ఇస్తామన్న అధినాయకత్వం హామీ మేరకు తాజాగా ఆయన అభ్యర్థిత్వాన్ని ప్రకటించినట్లు పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి గెలుపొందిన ఆత్రంసక్కు ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరారు. అప్పటి నుంచి బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నారు. ఇప్పటికే బీజేపీ పార్టీ ఆదివాసీ నేతను అభ్యర్థిగా ఖరారు చేయడం, కాంగ్రెస్‌పార్టీ ఆదివాసీ నేతను బరిలోకి దించేందుకు అవకాశం ఉండడంతో బీఆర్ఎస్ కూడా ఆదివాసీనేతకు అవకాశం కల్పించింది. పొత్తుల్లో భాగంగా ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి బీఎస్పీ పార్టీ అభ్యర్థి, జడ్పీ మాజీ చైర్మన్ సిడాంగణపతికి అవకాశం దక్కుతుందన్న ప్రచారం జరిగింది. కానీ ఆదిలాబాద్ జిల్లా బీఆర్ఎస్ నేతలంతా ఆత్రంసక్కు వైపే మొగ్గు చూపడంతో ఆయన అభ్యర్థిత్వాన్ని పార్టీ అధిష్ఠానం ఖరారు చేసింది. కాగా గత లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున పోటీ చేసి ఓటమిపాలైన నగేశ్.. తనకు ఈసారి టికెట్ దక్కదని భావించి పార్టీని వీడి బీజేపీలో చేరారు. ఆయనకు ఆదిలాబాద్ టికెట్ ప్రకటించారు.

కుటుంబ సభ్యులతో వాగ్వాదం..

క్షణికావేశంలో బలవన్మరణం


కుమారస్వామి మృతదేహం

కృష్ణకాలనీ (భూపాలపల్లి), మార్చి 14: కుటుంబ సభ్యులతో వాగ్వాదం చోటుచేసుకొని క్షణికావేశంలో ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన భూపాలపల్లి పట్టణ పరిధి సుభాష్‌కాలనీలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...

సుభాష్‌కాలనీకి చెందిన తమ్మిశెట్టి కుమారస్వామి (55) కూలిపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం పనికి వెళ్లి రాగా కుటుంబ సభ్యులతో వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో మనస్తాపం చెందిన కుమారస్వామి గడ్డిమందు తాగాడు. దీంతో కుటుంబ సభ్యులు అతడిని మంజూర్‌నగర్‌లోని వంద పడకల ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగానే కుమారస్వామి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

సింగరేణి కార్మికుడిని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

కృష్ణకాలనీ (భూపాలపల్లి), మార్చి 14: సింగరేణి కార్మికుడిని ఆర్టీసీ బస్సు ఢీకొని సింగరేణి కార్మికుడు స్వల్పంగా గాయపడిన సంఘటన భూపాలపల్లి పట్టణ పరిధి మంజూర్‌నగర్‌లోని ఏరియా ఆస్పత్రి ఎదుట గురువారం చోటుచేసుకుంది. రెడ్డికాలనీకి చెందిన నరేష్ సింగరేణిలో పనిచేస్తున్నాడు. సింగరేణి ఏరియా ఆస్పత్రికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న క్రమంలో భూపాలపల్లి డిపో నుంచి హనుమకొండకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొంది. దీంతో అతడు పక్కకు దూకడంతో పెను ప్రమాదం తప్పింది. కాలికి స్వల్ప గాయంతో సురక్షితంగా బయటపడ్డాడు.

హైదరాబాద్‌లో జిల్లా విద్యార్థిని ఆత్మహత్య

వెంకటాపురం మండలం ఆలుబాకలో విషాదఛాయలు

మృతికి కారణమైన వ్యక్తిని అరెస్టు చేయాలంటూ ఆందోళన

మృతదేహంతో ర్యాలీ నిర్వహించిన కుటుంబీకులు, స్థానికులు



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

వెంకటాపురం(నూగూరు), మార్చి 14: హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్‌లోని గల ఓ ప్రైవేట్ ఉమెన్స్ హాస్టల్‌లో ఉంటూ ఎంబీఏ చదువుతున్న ములుగు జిల్లా వెంకటాపురం మండలం ఆలుబాక గ్రామానికి చెందిన సుంకరి సాహితి(24) ఆత్మహత్య చేసుకోవడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సాహితి బుధవారం రాత్రి తన గదిలో ఎవరూలేని సమయంలో ఉరేసుకుని చనిపోగా.. ఆమె తండ్రి సుబ్బారావు ఇచ్చిన ఫిర్యాదుతో గురువారం దిల్‌సుఖ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అయితే ఆమె ఆత్మహత్యకు కారణాలపై పోలీసులు విచారణ జరుపుతున్నారు. గురువారం రాత్రి సాహితి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురాగా.. సాహితి మృతికి కారణమైన వెంకటాపురానికి చెందిన చిడెం హరీశ్ అనే వ్యక్తిని అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఆమె కుటుంబసభ్యులు, బంధువులు వెంకటాపురం మండల కేంద్రంలో ఆందోళనకు దిగారు. సాహితి మృతదేహంతో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. హరీశ్ తరచూ దిల్‌సుఖ్‌నగర్‌లో సాహితి ఉంటున్న హాస్టల్ వద్దకు వెళ్లి ప్రేమపేరుతో వేధింపులకు పాల్పడడంతోనే తట్టుకోలేక సాహితి ఆత్మహత్య చేసుకుందని, సాహితి మృతికి కారణమైన హరీశ్, అతడి తండ్రి మోహన్‌రావుపై చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. ప్రభుత్వం స్పందించి నిందితుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతురాలి మేనమామ బాలకృష్ణ మాట్లాడుతూ హరీశ్ వేధింపులు తాళలేకే తమ మేనకోడలు సాహితి చనిపోయిందని, పోలీసులు స్పందించి విచారణ చేపట్టి అతడిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ అశోక్ ముందస్తుగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సాహితికి తల్లిదండ్రులు సుబ్బారావు, కుమారి, తమ్ముడు తరుణ్ ఉన్నారు.

పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ఏర్పాటు

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

ములుగు కలెక్టరేట్/భూపాలపల్లి కలెక్టరేట్ మార్చి 14: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు అప్పగించిందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. జూన్ 10లోగా పాఠశాలల్లో కనీస సదుపాయాల కల్పన పూర్తి చేయాలని అన్నారు. గురువారం ఆమె హైదరాబాద్ నుంచి రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మహిళాశక్తి కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ బాధ్యతలను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని అన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ప్రతి ప్రభుత్వ పాఠశాలకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను సత్వరమే ఏర్పాటు చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల స్కూల్ యూనిఫాం కుట్టే బాధ్యతను స్వశక్తి మహిళా సంఘాలకు కేటాయించామన్నారు. జిల్లాలో ఉన్న విద్యార్థుల సంఖ్యకనుగుణంగా స్కూల్ యూనిఫాం కుట్టే సామర్థ్యం గల మహిళా సంఘాలను గుర్తించి వారికి వెంటనే ఆర్డర్ అందించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు, తరగతిగదుల మైనర్, మేజర్ మరమ్మతులు, నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లను ఉపయోగంలోకి తీసుకురావడం, బాలికల కోసం అదనపు మరుగుదొడ్ల నిర్మాణం, తరగతిగదుల్లో విద్యుత్ సౌకర్యం వంటి మౌలిక వసతులు అమ్మ పాఠశాల కమిటీల ద్వారా కల్పించాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల వద్ద రూ.25వేల వరకు ఎమర్జెన్సీ నిధులు వినియోగించవచ్చని, పాఠశాలల్లో చేపట్టిన పనులకు రూ.లక్ష వరకు ఎంపీడీవో పరిశీలించి బిల్లులు చెల్లిస్తారని అన్నారు. రూ.లక్షకుపైగా పనులకు ఎంబుక్కులను పరిశీలించి కలెక్టర్ చెల్లింపులు చేస్తారని, వీడియో కాన్ఫరెన్స్‌లో ములుగు కలెక్టర్ ఇలాత్రిపాఠి, భూపాలపల్లి కలెక్టర్ భవేష్ మిశ్రా, భూపాలపల్లి, ములుగు అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, శ్రీజ, ములుగు డీఆర్‌డీవో శ్రీనివాస్, డీఈవో పాణిని, డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య, సీపీవో ప్రకాష్, బీసీ వెల్ఫేర్ అధికారి రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆలయ గోడ కూల్చివేత

చిట్యాల, మార్చి 14: మండలంలోని జూకల్ శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయ ప్రహరీని కాంగ్రెస్ నాయకుడు పోలోజు సంతోష్, ఆయన కుమారుడు అరవింద్ గురువారం కూల్చివేశారని గ్రామస్తులు తెలిపారు. పక్కనే సంతోష్‌కు చెందిన స్థలం ఉందని ఇటీవల ఆలయ పునరుద్ధరణలో భాగంగా ప్రహరీకి ఉన్న గేటును కమిటీ సభ్యులు తొలగించారని పేర్కొన్నారు. తిరిగి గేటును అమరుస్తున్న క్రమంలో సంతోష్ పనులను అడ్డుకుని గోడను కూల్చివేసినట్లు తెలిపారు. ఈ సంఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో సంతోష్, అతడి కుమారుడిపై ఫిర్యాదు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

రాఘవపట్నంలో సమ్మక్క జాతర


సమ్మక్కను తీసుకొస్తుండగా స్వాగతం పలుకుతున్న భక్తులు

గోవిందరావుపేట, మార్చి 14: మండలంలోని రాఘవపట్నం గ్రామంలో సమ్మక్క జాతర ఘనంగా జరుగుతోంది. ప్రధాన పూజారి కంటెం సమ్మయ్య గురు వారం రాత్రి సమ్మక్క తల్లి రూపాన్ని ఊరగుట్ట నుంచి డోలువాయిద్యాల నడుమ గ్రామానికి తీసుకువచ్చి గుడిలో ప్రతిష్ఠించారు. దేవుని రాకను కళ్లారా చూసి తరలించాలని వందలాదిగా తరలివచ్చిన భక్తులు పూజారులు గ్రామంలోకి రాగానే ఎదురేగి స్వాగతం పలికారు. నీళ్లారబోసి, మంగళహారతులిచ్చి, కొబ్బరికాయలు కొట్టి ఎదుర్కొన్నారు. శివసత్తులు పూనకాలతో ఊగిపోయారు. గోవిందరావుపేటతోపాటు తాడ్వాయి, ఏటూరునాగారం మండలాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తల్లిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ వేడుకల్లో పూజారులు వాసం సమ్మయ్య, కంటెం రవికుమార్, నగేష్, ప్రేమ్‌సాగర్, లక్ష్మీనారాయణ, నాగేందర్, రంజిత్ కుమార్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ధన్వాడ-దామెరకుంట రోడ్డుకు మహర్దశ

కాటారం, మార్చి 14: మండలంలోని ధన్వాడ-దామెరకుంట రోడ్డుకు మహర్దశ పట్టనుంది. సింగిల్‌రోడ్డుగా ఉన్న ఈ రహదారి భారీ వాహనాలు వెళ్లేలా మరింతగా విస్తరించనుంది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చేసిన ప్రతిపాదనల మేరకు సెంట్రల్ రోడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (సీఆర్‌ఐఎఫ్) నిధులు రూ.30 కోట్లు మంజూరయ్యాయి. ఈ మేరకు సుమారు 15 కిలోమీటర్ల పొడవైన రోడ్డు విస్తరణ కోసం కేంద్ర రోడ్లు, రవాణా శాఖ ద్వారా నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. రహదారి విస్తరణ జరిగితే ఆర్టీసీ బస్సులు నడిచి రైతులు, ప్రజలు, విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుందని పలువురు భావిస్తున్నారు.

అపరిచితులకు ఆశ్రయం ఇవ్వొద్దు

గోవిందరావుపేట, మార్చి 14: గొత్తికోయగూడాల్లోకి వచ్చే అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం కల్పించొద్దని పస్రా సీఐ శంకర్ సూచించారు. కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా ఆయన ఎస్సై కమలాకర్, పోలీస్ సిబ్బందితో కలిసి పస్రా సమీపంలోని బూడిదగడ్డ గొత్తికోయగుంపును గురువారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన గొత్తికోయలను సమావేశపరిచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గొత్తికోయగూడాల్లోకి ఎవరైనా కొత్త వ్యక్తులు వచ్చినట్లయితే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రశాంత వాతావరణంలో జీవనం గడపాలని, గొడవలు జరిగినట్లు తెలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సివిల్, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రవీణ్ కుమార్ వ్యాఖ్యలను ఖండించాలి : డీఎస్‌పీ

ములుగు కలెక్టరేట్, మార్చి 14: ధర్మ సమాజ్‌పార్టీ(డీఎస్‌పీ) రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహరాజ్‌పై బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా ఇన్‌చార్జి నెగరకంటి సురేష్ కోరారు. ములుగులో ఆ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం గురువారం జరగ్గా సురేష్ మాట్లాడారు. తెలంగాణలోని మూడున్నర కోట్ల మంది బహుజనుల ఆత్మగౌరవాన్ని కేసీఆర్ పాదాల కింద తాకట్టుబెట్టి ఎంపీ టికెట్ అడుక్కుంటున్న ప్రవీణ్‌కుమార్ బహుజన యుద్ధం నుంచి బయటకు వెళ్లిపోవాలన్నారు. విశారదన్ మహరాజ్ కఠోర దీక్షతో 10వేల కిలోమీటర్లు స్వరాజ్య పాదయాత్ర చేశారని, దానిని రాజ్యాధికార కుట్ర చేశావని ఆరోపించారు. ఇప్పటికైనా విశారదన్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో నాయకులు మల్యాల మనోహర్, కరుణాకర్, తరుణ్, రాజశేఖర్, గణపతి, సాగర్, చరణ్, తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ క్షమాపణ చెప్పాలి

భూపాలపల్లిటౌన్ : బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ ధర్మ సమాజ్ పార్టీ అధినేత విశారధన్ మహరాజ్‌కు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని ఆ పార్టీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా నాయకుడు కొత్తూరి రవీందర్ డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టుమని పది నిమిషాలు కూడా కాన్షీరాం గురించి మాట్లాడలేని, ప్రజలను చైతన్యం చేయలేని ప్రవీణ్‌కుమార్ మూడేళ్ల క్రితం రాజకీయాల్లోకి వచ్చి మచ్చలేని నాయకుడు విశారధన్ పై విమర్శలు చేయడం విడ్డూరమన్నారు. దళిత బహుజన వాదాన్ని తప్పుదోవ పట్టించడం కోసమే ఆయన కుట్ర చేస్తున్నారని విమర్శించారు. ప్రవీణ్ కుమార్ వెంటనే రాజకీయాల్లోంచి తప్పుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో దొమ్మాటి రవీందర్, కండె రవి, దశరథం, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ విద్యార్థులకు ఉచిత శిక్షణ

ములుగు కలెక్టరేట్, మార్చి 14: హైదరాబాద్ స్కూల్ ఆఫ్ ఫైనాన్స్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో నిర్వహించే బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ ఉచిత శిక్షణను జిల్లాలోని బీసీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా బీసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ సీహెచ్.రవీందర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 26ఏళ్లలోపు అభ్యర్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టీఎస్‌బీసీస్టడీసర్కిల్.సీజీజీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఈనెల 25లోగా నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. వీరికి ఈనెల 31న ఉమ్మడి వరంగల్ జిల్లాకేంద్రంలో ఆన్‌లైన్ స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 0870-2571192, 040-29303130 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

పెద్దపల్లిలో బీజేపీ జెండా ఎగరడం ఖాయం

కాటారం, మార్చి 14: పెద్దపల్లి పార్లమెంట్ స్థానంలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మన భాస్కర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గురువారం బీజేపీ నాయకులతో కలిసి భాస్కర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇతర పార్టీల అభ్యర్థులకు ఓట్లేసినప్పటికీ పార్లమెంట్ ఎన్నికల్లో మోదీని మూడోసారి ప్రధానిగా చేయడం కోసం బీజేపీకే ఓటు వేయాలని ప్రజలు నిర్ణయం తీసుకున్నారని అన్నారు. బలమైన అభ్యర్థి గోమాస శ్రీనివాస్‌కు పార్టీ టికెట్ ఇవ్వడంతో పెద్దపల్లి ఎంపీ సీటులో తొలిసారి బీజేపీ జెండా ఎగురవేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి గంట అంకయ్య, కార్యదర్శి వేముల లింగయ్య, నాయకులు గంట రామచంద్రం, తోకల బాలయ్య పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన కలిగి ఉండాలి

కాటారం, మార్చి 14: పౌష్టికాహార ప్రయోజనాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ మహదేపూర్ సీడీపీవో రాధిక అన్నారు. మండలంలోని అంకుశాపూర్, విలాసాగర్ జీపీల పరిధి అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం పోషణ్ పక్వాడా కార్యక్రమాలు నిర్వహించారు. రకరకాల పండ్లు, కూరగాయలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా అంకుశాపూర్‌లో సీడీపీవో రాధిక, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ, విలాసాగర్‌లో గంగారం సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వీణ పెరటి తోటల పెంపకం, పౌష్టికాహార ఆవశ్యకత, చిరుధాన్యాలతో వంటలు, గర్భిణులు, బాలింతలకు 1000 రోజుల ప్రాముఖ్యతను వివరించారు. గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన చేశారు. ఈ కార్యక్రమాల్లో బయ్యారం మాజీ సర్పంచ్ సంధ్యారాణి, హెచ్ఎం లత, అంగన్‌వాడీ టీచర్లు హైమావతి, శ్రీలత, షాహేదా బేగ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ ఆధ్యాత్మిక సమ్మేళనానికి విద్యార్థులు

భూపాలపల్లిటౌన్, మార్చి 14: ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన కన్హా శాంతివనంలో శుక్రవారం నుంచి జరిగే అంతర్జాతీయ ఆధ్యాత్మిక సమ్మేళనానికి భూపాలపల్లి నుంచి ప్రభుత్వ డిగ్రీ విద్యార్థులు వెళ్లనున్నారు. వీరిని భూపాలపల్లికి చెందిన హార్ట్‌ఫుల్‌నెస్ సెంటర్ నిర్వాహకులు రవీందర్ ఆధ్వర్యంలో 50 మంది ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. ఈ సమ్మేళనంలో వివిధ దేశాల ప్రముఖులతోపాటు మన దేశ రాష్ట్రపతి ముర్ము కూడా హాజరుకానున్నట్లు తెలిపారు. ఇందులో పాల్గొన్న వారికి మెడిటేషన్‌తో పాటు ప్రపం చ శాంతి గురించి వివరించనున్నట్లు పేర్కొన్నారు. కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో భూపాలపల్లి నుంచి విద్యార్థులకు ఉచితంగా బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

కొత్తగుంపులో కమ్యూనిటీ కాంటాక్టు

వెంకటాపురం(నూగూరు), మార్చి 14: కమ్యూనిటీ కాంటాక్టు కార్యక్రమంలో భాగంగా ఎస్సై అశోక్ మండలపరిధిలోని కొత్తగుంపును గురువారం సందర్శించారు. ఈసందర్భంగా గ్రామస్థులను సమావేశపరిచి మాట్లాడారు. అసాంఘికశక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామంలోకి అపరిచిత వ్యక్తులు వచ్చినట్లయితే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సహాయ ,సహకారాలు అందిస్తానని అన్నారు.

ఏటూరునాగారంలో స్పైసెస్ బోర్డు వర్క్‌షాప్

ఏటూరునాగారం, మార్చి 14 : మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సుగంధ ద్రవ్యాల అభివృద్ధి సంస్థ స్పైసెస్ బోర్డు కామర్స్ ఇండస్ట్రీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె. చిన్న అధ్యక్షతన గురువారం వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జాతీయ మిర్చి టాస్క్ ఫోర్స్ డైరెక్టర్ నాసిరెడ్డి సాంబశివరెడ్డి హాజరయ్యారు. భారత ప్రభుత్వం సూక్ష్మ, లఘు పరిశ్రమల శాఖ నుంచి ములుగు జిల్లాలో క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రాంని మంజూరు చేయించి స్థానిక యువతకు ఉపాధి కల్పించే విధంగా ప్రణాళిక రూపొందించినట్లు ఆయన తెలిపారు. స్పైసెస్ బోర్డు వరంగల్ రీజనల్ కార్యాలయ సహాయ సంచాలకురాలు విజ్ఞిస్న మాట్లాడుతూ సుగంధ ద్రవ్యాల ఎగుమతిదారులు, వ్యాపారులకు అందిస్తున్న పథకాలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ సురేశ్, ఎస్‌బీఐ వరంగల్ రూరల్ రీజనల్ మేనేజర్ అబ్దుల్ రహ్మాన్, జిల్లా ఆహార శుద్ధి పరిశ్రమల రిసోర్స్ పర్సన్ శ్రీకాంత్, ఎస్‌బీఐ ములుగు బ్రాంచి మేనేజర్ జనార్దన్, ఏటూరునాగారం బ్రాంచి మేనేగర్ భిక్షపతి, ఏటూరునాగారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం. రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణాలకు దీటుగా పల్లెల అభివృద్ధి

● ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు


పంబాపూర్‌లో మహిళా సమాఖ్య భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

కృష్ణకాలనీ (భూపాలపల్లి), మార్చి 14: పట్టణాలకు దీటుగా పల్లెల అభివృద్ధికి కృషి చే స్తున్నామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. భూపాలపల్లి మండలంలోని ఆజంనగర్, పంబాపూర్ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ఆయన గురువారం శంకుస్థాపనలు చేశారు. ఆజంనగర్ ప్రభుత్వ పాఠశాలలో రూ. 4 లక్షల 95వేల వ్యయంతో నిర్మిస్తున్న టాయిలెట్ బ్లాక్ పనులకు శంకుస్థాపన చేశారు. పంబాపూర్ హనుమాన్ ఆలయ కాంపౌండ్ వాల్, అంగన్‌వాడీ సెంటర్‌లో మిగులు పనులు, మహిళా సమాఖ్య భవనం నిర్మాణానికి, భీంఘన్‌పూర్ చెరువు మరమ్మతుల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. పల్లెల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అన్నారు. నియోజవర్గానికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేశారని తెలిపారు. వీటితో అన్ని రకాల సౌకర్యాలు కల్పించే దిశగా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముదిరాజ్ పూజారులకు రక్షణ కల్పించాలి : మెపా

ములుగు, మార్చి 14: గట్టమ్మ దేవాలయంలో పూజలు చేసుకోవడానికి జాకారానికి చెందిన ముదిరాజ్ పూజారులు అర్హులని, వారికి పోలీసులు రక్షణ కల్పించాలంటూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్(మెపా) రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. గట్టమ్మ ఆలయంలో పూజా హక్కులపై ఇటీవల వివాదం నెలకొన్న నేపథ్యంలో కోర్టును ఆశ్రయించగా ముదిరాజ్ పూజారులకు అనుకూలంగా అభిప్రాయాన్ని వ్యక్తపరిచినట్లు వెల్లడించారు. కోర్టు ఉత్తర్వులను ములుగు పోలీసులకు అందజేయడం జరిగిందని తెలిపారు.

భూ సమస్యలపై దరఖాస్తులు చేసుకోవాలి

మంగపేట, మార్చి 14: ధరణిప పోర్టల్ ప్రక్షాళనలో భాగంగా భూ సమస్యలపై రైతులు దరఖాస్తులు చేసుకోవాలని తహసీల్దార్ వీరస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను పరిశీలించి నిబంధనల మేరకు భూ సమ్యలను పరిష్కరిస్తామని పేర్కొన్నారు. మీ-సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. నిర్దేశిత రుసుం కన్నా ఎక్కువ డబ్బులు తీసుకున్నా, దళారులు ప్రలోభాలు పెట్టినా తమకు ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్సైలు

మొగుళ్లపల్లి/టేకుమట్ల, మార్చి 14: మొగుళ్లపలి ఎస్సైగా బోనగాల అశోక్, టేకుమట్ల ఎస్సైగా జి.ప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. మొగుళ్లపల్లిలో విధులు నిర్వర్తించిన మాధవ్‌గౌడ్ బదిలీపై ఆసిఫాబాద్ వీఆర్‌కు వెళ్లగా ఆయన స్థానంలో రామగుండం కమిషనరేట్ నుంచి అశోక్ వచ్చారు. టేకుమట్లలో ఎస్సైగా పనిచేసిన జి.సుధాకర్ బదిలీపై భూపాలపల్లికి వెళ్లగా హనుమకొండ జిల్లా ఆత్మకూర్ ఎస్సైగా పని చేస్తున్న ప్రసాద్ బదిలీపై టేకుమట్ల వచ్చారు.


తడారుతున్న గొంతులు

గిరిపుత్రులకు తప్పని నీటి తిప్పలు

మంగపేట, మార్చి 14: వేసవి ప్రారంభమైంది... గిరిపుత్రుల వెతలు మాత్రం అలాగే కొనసాగుతున్నాయి. మండలంలోని నర్సింగసాగర్ గ్రామ పంచాయతీ పరిధి శనిగకుంట గ్రామంలో గిరిజనుల గొంతులు తడారిపోతున్నాయి. అయినా పట్టించుకొనే నాథుడే కరువయ్యాడు. రెండు నెలలుగా తాగునీరు లేక ఇక్కడి ప్రజలు అవస్థపడుతున్నారు.

గ్రామంలో నాలుగు చేతిపంపులు ఉన్నాయి. వాటిలో రెండు పూర్తిగా చెడిపోగా మరో రెండు తాగునీటికి ఉపయోగ పడడం లేదు. దీంతో గిరిజనులు రెండు కిలో మీటర్ల దూరంలోని మల్లూరువాగు, వ్యవసాయ బోర్ల వద్దకు కాలినడకన వెళ్లి నీళ్లను మోసుకురావాల్సి వస్తోంది.

పూర్తి గిరిజన గూడెమైన శనిగకుంటలో 150 ఇళ్లు ఉన్నాయి. సుమారు 600 మంది జనాభా ఉంది. ఉన్న రెండు చేతి పంపుల నుంచి నీళ్లు చుక్కలు చుక్కలుగా వస్తున్నాయి. ఎంతో శ్రమకోర్చితే గానీ కొద్ది పాటి నీళ్లు వస్తున్నాయి. కిలో మీటరు దూరంలోనే ఐటీడీఏ ఇంజనీరింగ్ విభాగం ఏర్పాటు చేసిన ఓపెన్ బావి ఉంది. అది గిరిజనులకు కొంత వరకు ఉపయోగపడుతుండగా ఆ నీళ్లు తాగడానికి పనికిరాకుండా చెత్తాచెదారంతో నిండి ఉంటోంది. బావిలోని నీటిని వాడుకుందామంటే విద్యుత్ మోటార్ పనిచేయడం లేదు. ఓపెన్ బావికి ప్రత్యేకంగా పైప్‌లైన్ బిగించి, విద్యుత్ సౌకర్యం, మోటర్‌ను అమర్చితే నీటి సమస్య కొంత మేరకైనా తీరుతుందని గ్రామస్థులు అంటున్నారు. కానీ... ఇటు గ్రామ పంచాయతీ అధికారులు గానీ, అటు ఐటీడీఏ అధికారులు గానీ పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. గ్రామంలో మిషన్ భగిరథ పైప్‌లైన్ ఉన్నా అది చాలా దూరం ఉండటం వల్ల నీటి ప్రెషర్ సరిపోవడం లేదని అధికారులు చెబుతున్నారు. ఇలా నీటిసౌకర్యం లేక తాము అవస్థ పడుతున్నామని, ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని శనిగకుంట గిరిజనులు కోరుతున్నారు.



శనిగకుంటలో సరిగా పనిచేయని చేతిపంపు వద్ద మహిళలు, ఐటీడీఏ నిర్మించిన ఓపెన్ బావి

ఎంహెచ్ఎన్ జాయింట్ డైరెక్టర్ పర్యటన

వెంకటాపూర్(రామప్ప), మార్చి 14: మండలంలో మాతా సంరక్షణ, పోషణ జాయింట్ డైరెక్టర్(ఎంహెచ్ఎన్) డాక్టర్ పద్మజ గురువారం పర్యటించారు. ముందుగా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి తనిఖీ చేశారు. ఆరోగ్య మహిళా కార్యక్రమం తీరును డాక్టర్ రిషితను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బంది హాజరు, మందుల నిల్వల రిజిష్టర్లను పరిశీలించారు. అన్నిరకాల మందులు అందుబాటులో ఉన్నాయా..? అని ఫార్మసిస్టును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ట్రాక్టర్ ద్వారా 12 కిలోమీటర్లు అడవిలో ప్రయాణించి రోలుబండ గొత్తికోయగూడాన్ని సందర్శించారు. గూడెంలో నివాసం ఉంటున్న గొత్తికోయల ఇళ్ల వద్దకు వెళ్లి వారి వివరాలు, ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యశిబిరం ఏర్పాటు చేసి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సౌజన్య, చీర్ల శ్రీకాంత్, పవన్‌కుమార్, సీహెచ్‌వో సదానందం, హెచ్ఈ భాస్కర్, ఏఎన్ఎంలు స్వప్న, అనురాధ, వజ్రమ్మ, ఎల్‌టీ కృష్ణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

విద్యాశాఖ జిల్లా అధికారి పాణిని

ములుగు కలెక్టరేట్, మార్చి 14: ఈనెల 18 నుంచి ఏప్రిల్ 2 వరకు జరిగే పదోతరగతి వార్షిక పరీక్షల నిర్వహణలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని విద్యాశాఖ జిల్లా అధికారి పాణిని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా 21 పరీక్ష కేంద్రాలు ఉన్నాయని, వాటిలో 3,088 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. పరీక్షల నిర్వహణలో 21మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 22మంది డిపార్టుమెంటల్ ఆఫీసర్లు, 200 మంది ఇన్విజిలేటర్లు, రెండు ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందాలు పరీక్షల నిర్వహణలో పాల్గొంటారని తెలిపారు. పరీక్ష కేంద్రంలోకి మొబైల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించకూడదని, పరీక్ష జరుగుతున్న సమయంలో మొదటి అరగంటలోపు సిబ్బంది పోలీస్ ఎస్కార్ట్ ఫోన్ ద్వారా విద్యార్థుల హాజరు వివరాలను ఉన్నతాధికారులకు తెలియజేయాలని సూచించారు. చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంటల్ ఆఫీసర్లు ప్రతిరోజూ ప్రశ్నపత్రాల సీల్, ఓపెన్ చేయడం, వితరణ చేయడం, జవాబు పత్రాలను సీల్ చేయడం వంటివి సీసీ కెమెరాల్లో నమోదు అయ్యేలా చేయాలని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144సెక్షన్ విధిగా అమలు చేయాలని, విద్యార్థినుల స్క్రీనింగ్ కోసం మహిళా ఉపాధ్యాయుల సహాయం తీసుకోవాలని, డిపార్టుమెంటల్ అధికారులు, ఇన్విజిలేటర్లకు పరీక్షలు ప్రారంభానికి ఒకరోజు ముందుగానే సమావేశం నిర్వహించి సూచనలు చేయాలని సూచించారు. అదేవిధంగా పరీక్షల సమయంలో బస్సులు ఎక్కువగా నడిపి విద్యార్థులకు సహకరించాలని ఆర్టీసీ అధికారులను కోరారు. విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులను గంట ముందు పరీక్ష కేంద్రం వద్ద విడిచి ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాసేలా సహకరించాలని కోరారు.